నీకు లభ్యమవుతాను అన్నాడు పరమాత్మ.

నువ్వు భగవంతుడు మాటలు శ్రద్ధగా శ్రవణం చేసి, ఎలా జీవిస్తే మనకి ఆయన మోక్షం ప్రసాదిస్తాడో ఆ రకంగా జీవించటం నేర్చుకుని, మీ ఇంటి దగ్గర వృద్ధులు వుంటే వారిమీద చిరాకుపడకుండా భగవంతుడు మనకి ఇచ్చిన డ్యూటీ అని, ఆ రూపంలో వున్నవాడు కూడా నారాయణుడే అని నారాయణ స్మరణ చేసుకుంటూ వారికి సేవ చెయ్యండి. ఆ రకంగా మీ జీవితాన్ని బాగుచేసుకోండి. మీలో ఏమయినా లోపాలు ఉంటే వున్నాయని బాధపడకండి అవి పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి. మీ పనులు మీరు చేసుకుంటూ భగవంతుడిని గమ్యంగా పెట్టుకొని మీరు జీవించటం నేర్చుకుంటే కొన్ని అలవాట్లు వాటంతటవే కాల ప్రవాహంలో పోతాయి. అందుచేత మీరు నామస్మరణ చేయండి. నామస్మరణ చేయుటం వలన మీరు పవిత్రులవుతారు. పరమపవిత్రుడికి మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. పవిత్రత, ఏకాగ్రత రెండూ మీ రెండు కళ్ళతోటి సమానం అనుకొని ఆ రెండూ సాధించడానికి నువ్వు ప్రయత్నం చేస్తూ తరించు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-01-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతలో జ్ఞానయోగం, కర్మయోగం,భక్తియోగం,ధ్యానయోగం అన్ని యోగాలకు సమానమైన ప్రాముఖ్యత ఇచ్చాడు. భగవద్గీత అంటే అది మోక్షద్వారం అంటే మోక్షంలో ప్రవేశించటానికి తగిన సూచనలు అన్నీ భగవద్గీతలో భగవంతుడు జీవకోటికి బోధించాడు. అందులో అరిషడ్వర్గాల గురించి భగవంతుడు ఎక్కువగా చెప్పాడు. అరిషడ్వర్గాలు అంటే నీలోపల ఉన్న ఆరు శత్రువులు, అవి ఎవరు అంటే కామ, క్రోధ, లోభ, మోహ,మద,మాత్సర్యములు. ఇవి నీలోపల ఉన్న శత్రువులు, ఇవి బయట ఉండవు. బ్రహ్మజ్ఞానం పొందిన వారిలో తప్పించి అంటే రామకృష్ణుడు, రమణుడు, వశిష్ఠుడు ఇటువంటి మహాత్ములలో తప్పించి ప్రతీ మనిషిలోను ఈ శత్రువులు ఉంటాయి. వాడు ధనవంతుడా పేదవాడా, వాడికి అధికారం ఉందా, లేదా వారు స్త్రీలా పురుషులా అని ఇటువంటి సంబంధం ఏమీలేదు. సాధకులలో కూడా ఇవి ఉంటాయి. సిద్ధిపొందేవరకూ వీటి గొడవ తప్పదు. వాల్మీకి రామాయణంలో ఏమని చెప్పాడంటే ఈ సృష్టిలో ఉన్న ప్రతీ జీవరాశిని కాలం కుమ్మేసి విడిచిపెడుతుంది అని చెప్పాడు. ఎవరి పరిస్థితులు ఎలా ఉంటాయో మనం చెప్పలేము. ఒక ఏరియాకు రాజుగా ఉన్న ఆయన చివరిరోజులలో ఆయన దగ్గర పనిచేసిన గుమాస్తా అన్నం పెడితే తిని

కాలక్షేపం చేయవలసివచ్చింది. ప్రారబ్దాలు చాలా విచిత్రంగా ఉంటాయి. కొంతమంది ఏమీ లేకపోయినా రోజులు బాగా వెళ్ళిపోతాయి. కొంతమంది ఇంటినిండా బంగారం, డబ్బు, ఆస్తులు ఉన్నా పొట్ట మాడిపోతూ ఉంటుంది. ప్రపంచంలో ఎన్నిరకాల జీవరాశులు ఉన్నాయో అన్ని రకాల ప్రారబ్దాలు ఉన్నాయి. రకరకాల జీవరాశులు, రకరకాల ప్రారబ్దాలతో ఈ సృష్టి నిండిఉంది. వీరందరిని కాలం కుమ్మేసి విడిచిపెడుతుంది అని వాల్మీకి చెప్పాడు.

రమణమహర్షిగారు ఏమన్నారంటే నువ్వు నేను, నేను అని అంటున్నావు కదా. ఆ నేనును అంటి పెట్టుకొని ఈ శత్రువులు అన్నీ ఉన్నాయి. ఆ నేను పోతే ఇవి అన్నీ పోతాయి. ఆ నేను పోకపోతే ఇవి కూడా పోవు, ఇవి నీ కూడానే ఉంటాయి అని చెప్పారు. నాకు బ్రహ్మలోకం వెళ్ళాలని ఉంది అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. బ్రహ్మలోకానికి వెళ్ళాలని ఎవరు అంటున్నారు. నీ శరీరం అనటంలేదు, నీలో ఉన్న నేను అంటోంది. బ్రహ్మలోకానికి వెళ్ళాలని ఏ నేను అయితే అంటోందో ఆ నేనును తొలగించుకోగలిగితే ఇప్పడే బ్రహ్మంలో ఉంటావు కదా అని చెప్పారు. బ్రహ్మలోకం, స్వర్గలోకం ఆ తిరుగుడు అంతా నీకు ఎందుకు, ఆ చాకిరీలు నీకు ఎందుకు. ఒకవేళ వెళ్ళినా మరల నిన్ను భూమి మీదకు గెంటేస్తారు. అందుచేత బ్రహ్మలోకానికి వెళ్ళటానికి అనుకూలమైన పనులు ఇక్కడ చేసే బదులు, ఏ నేను అయితే బ్రహ్మలోకానికి వెళతానంటోందో ఆ నేనును తొలగించుకోవటానికి ఇక్కడ ప్రయత్నం చెయ్యి. ఆ నేను పోతే ఇంక నీకు ప్రయాణాల గొడవలేదు. ఇప్పడే ఇక్కడే నువ్వు బ్రహ్మంలో ఉంటావు. బ్రహ్మంలో ఉన్నప్పడు ఇంక నీకు బ్రహ్మలోకం ఎందుకు. బ్రహ్మలోకం అబద్ధం, బ్రహ్మం నిజం.

సాధన ఎంతకాలం చెయ్యాలి అని ఒకరు కంచి పరమాచార్యులవారిని అడిగారు. మనకు ఆస్తులు లేకపోయినా, పదవులు లేకపోయినా నేను ఒకటి ఉంది కదా. మనం ఎక్కడికి వెళ్ళినా చుట్టాల ఇంటికి వెళ్ళినా, యాత్రలకు వెళ్ళినా ఈ నేను వేసుకుని తిరుగుతూ ఉంటాము. మనం వట్టి చేతులతో వెళ్ళినా ఈ నేను మాత్రం మన కూడానే వచ్చేస్తోంది. శరీరం చనిపోయిన తరువాత కూడా ఈ నేను మనకూడా వచ్చేస్తుంది. మనం సంపాదించిన ఆస్తులు, డబ్బు ఇంటి దగ్గరే ఆగిపోతాయి. ఈ శరీరం స్మశానంతో ఆగిపోతుంది. ఈ నేను మాత్రం మన కూడా వచ్చేస్తుంది, దానిని మనం ఆపుచేయలేము. అంతేకాదు స్వర్గలోకం కావాలి, బ్రహ్మలోకం కావాలి, అని ఏదో ఒకటి కోరుకొంటూ ఉంటుంది. సాధన ఎంతకాలం చెయ్యాలి అని అడుగుతున్నావు. రెండు జన్మలు, మూడు జన్మలు అని నేను చెప్పను, రోజూ మూడు గంటలు చెయ్యి, నాలుగు గంటలు చెయ్యి అని నేను చెప్పను.

నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో అది కనిపించకుండా పోయేవరకు సాధన చెయ్యాలి. ఆ నేను కనబడటంలేదు అనుకోండి, ఏమిటి కనబడటంలేదు అని మనం కంగారుపడతాము ఎందుచేతనంటే మనం బతికేదే ఆ నేను కోసంకదా. ఆ నేను కనబడటం లేదు అనుకోండి కంగారుపడకుండా దానికోసం వెతకాలి. అలా వెతికినా అది కనబడకూడదు. ఒకవేళ మరల అది కనబడితే పునర్జన్మ వచ్చేస్తుంది. వెదికినప్పుడు అది కనబడితే మరల సాధన చెయ్యాలి అని చెప్పారు.

నీ శరీరం శవం అవ్వకముందే, శరీరం ఈ భూమిమీద అటు ఇటు తిరుగుతున్నప్పుడు కామక్రోధాలు నిశ్శేషంగా నాశనం చేయగలిగితే, ఈ శరీరం చనిపోయేవరకు నువ్వు ఆగనక్కరలేదు. మహర్షులు, మహాత్ములు, యోగులు ఏ స్థితిని అయితే పొందారో ఆ స్థితిని ఇప్పడే ఇక్కడే నువ్వు పొందవచ్చు. అప్పడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా బ్రహ్మమే. చావు ఇంక నిన్ను ముట్టుకోదు, నువ్వు అమృతస్థితిని పొందుతావు అని పరమాత్మ చెప్పాడు. కామక్రోధాల నుండి ఎలా బయటకు రావాలి అని కృష్ణుడు, వశిష్ఠుడు, బుద్ధుడు, రమణమహర్షిగారు ఇంకా చాలా మంది చెప్పారు. అందరికంటే జ్ఞానేశ్వర్ చెప్పింది నాకు బాగా నచ్చింది. జ్ఞానేశ్వర్ 21 సంవత్సరముల 6 నెలలు ఈ భూమి మీద ఉన్నాడు. 15వ సంవత్సరంలో భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసాడు. చాలామంది ఆచార్యులు భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసారు, వారు సాంప్రదాయబద్ధంగా వ్రాసారు. కాని జ్ఞానేశ్వర్ ఆయన హృదయాన్ని ఓపెన్ చేసి అక్కడ పెట్టాడు. ఆయనకు మామూలుగా మరణం రాలేదు, ఆయన జీవ సమాధి పొందారు. మహారాష్ట్రలో ఆయనను జ్ఞానదేవుడు అని పిలుస్తారు. ఆయన కామక్రోధాల గురించి వ్రాస్తూ మీరు హిమాలయపర్వతాలకు వెళ్ళి తపస్సులు చేస్తే కామక్రోధాలు పోతాయని గ్యారంటీ లేదు. పదిరోజులు అన్నంమానేస్తే కామక్రోధాలు పోతాయి అని అనుకోవద్దు. అప్పడు కామక్రోధాలు అణిగి ఉంటాయి. మరల అన్నం తినటం ప్రారంభిస్తే కామక్రోధాలు తిరిగి విజృంభిస్తాయి. మరి ఈ శరీరం చనిపోయాక కామక్రోధాలు పోతాయా అంటే అప్పడు అసలు పోవు అని చెప్పాడు. మరి కామక్రోధాలు ఎలా పోతాయి. నీకు సుఖపడాలని కాంక్ష ఉందా అని ఆయన ఒక భక్తుడిని అడిగాడు. ఉందండి అని చెప్పాడు. మేము సుఖంగా ఉండాలి, మా కుటుంబం సుఖంగా ఉండాలి అని అందరికీ అదే గొడవ కదా. మనం ఏ పని చేసినా సుఖాల కోసమే కదా, డబ్బు ఎందుకు సంపాదిస్తున్నాము, సుఖం కోసం సంపాదిస్తున్నాము. పెళ్ళిళ్ళు ఎందుకు చేసుకొంటున్నారు, సుఖం కోసమే కదా. ప్రారబ్దాన్ని బట్టి మీకు ఏదైనా దుఃఖం వచ్చినా, మాకు దుఃఖం రాకూడదు, మేము

సుఖంగా ఉండాలని అనుకొంటున్నారు కదా. నేను సుఖపడాలని ఇలా నువ్వు అనుకొన్నంత కాలం వెయ్యి జన్మలు ఎత్తినా, హిమాలయపర్వతాలకు వెళ్ళి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసినా నీకు కామక్రోధాలు పోవు అని చెప్పాడు. ఇంత గొప్పగా చెప్పినవాడు ఎవడూ నాకు కనబడలేదు. నీ లోపల హృదయం యొక్క లోయలలో నేను సుఖపడాలి అనే కోరిక నీకు ఉన్నంతకాలం నువ్వు కామక్రోధాలను జయించలేవు, ఇక్కడ కీలకం చెప్పాడు. మీరు స్త్రీలా, పురుషులా అనికాదు, అసలు మనిషికి సుఖపడాలని ఉంది కదా ఇంక నీకు కామక్రోధాలు ఎలా పోతాయి, ఇంకపోవు అని చెప్పాడు.

సుఖపడాలనే కోరిక ఎవడికైతే పోయిందో వాడికి నేచురల్ డెత్ వస్తుంది. కొంతమందికి రోగం ఏమీ ఉండదు, శరీరం ముసలిది అయి చనిపోతారు. శరీరం వయస్సును బట్టి ఎలాగ పోతోందో అలాగే సుఖపడాలనే కోరిక ఎవడికైతే లేదో వాడికి కామక్రోధాలు పోతాయి అని చెప్పాడు. నువ్వు ఎన్ని తపస్సులు చేసినా సుఖపడాలనే కోరిక నీలో ఉన్నప్పుడు మరల మాయ వచ్చేస్తుంది. ఆ కోరిక తీసుకొని వచ్చి నిన్ను మాయలో పడేస్తుంది అని చెప్పాడు. ఈ తపస్సుల వలన, యాగాలవలన ఏమీ ప్రయోజనం లేదు, చెప్పకోవటానికి పనికి వస్తాయి అన్నాడు. నీకు సుఖపడాలనే కోరిక ఉన్నంతకాలం కోటి జన్మలు ఎత్తినా కామక్రోధాలలోనుండి బయటకు రాలేవు. ఇంకో రహస్యం చెప్పాడు. నీకు సుఖపడాలనే కోరిక లేదు అనుకో నీకు దుఃఖం వచ్చినా, సుఖం వచ్చినా దాని స్పృహ నీకు ఉండదు అని చెప్పాడు. అంటే దుఃఖం వచ్చినప్పుడు నేను దుఃఖపడుతున్నాను ఏమిటి అని నీకు అనిపించదు, సుఖం వచ్చినప్పుడు నేను సుఖపడుతున్నాను అని అనిపించదు, అంటే ఆ స్పృహ నీకు ఉండదు, ఇది గొప్ప కీలకం. 15 సంవత్సరాల పిల్లవాడు ఎంత అందంగా చెప్పాడో చూడండి. ధ్యానం చేయండి, జపం చేయండి అని చాలా మంది చెపుతారు. లోపల కోరిక ఉన్నప్పుడు ఎన్నాళ్ళు ధ్యానం చేస్తే అదిపోతుంది. ఆ కోరిక కాన్సర్ జబ్బులాంటిది, అది అలా వ్యాపిస్తూ ఉంటుంది కాని ఇంక తగ్గదు. పూర్వం ఋషులు తపస్సులు చేసి చేసి కామక్రోధాలకు లొంగిపోయినట్లుగా పురాణాలు చెపుతున్నాయికదా. జ్ఞానేశ్వర్ చెప్పింది కరెక్ట్. ఆయన తపస్సులు వద్దనటంలేదు. నేను సుఖపడాలనే కోరిక నీలో ఉన్నప్పుడు ఇదంతా సున్నా, అది మరల నిన్ను మాయలో పడేస్తుంది అది జ్ఞానేశ్వర్ చెప్పేది.

మీకు ఆరోగ్యం బాగుంది, జేబులో డబ్బులున్నాయి, క్షేత్రాలు తిరిగితే తిరిగిరండి కాలక్షేపం అవుతుంది, ఇంట్లో గొడవలు కొన్ని తగ్గుతాయి. కొంతమందికి ఇంట్లో గొడవలుంటే

తాత్కాలికంగా వైరాగ్యం వస్తుంది, ఆ వైరాగ్యం నిజంకాదు. మీ కోడలు ఏమైనా పేచీలు పెడుతోంది అనుకోండి కొన్నాళ్ళు దూరంగా వెళ్ళి వద్దామురాబాబూ అనుకొంటారు. ఇవన్నీ నిజంకాదు. నువ్వు వేరు, నేను వేరు అనే తలంపు మనకు ఉంది కదా. ఆ వేరుబుద్ధే మాయ. అది ఉన్నంతకాలం పేచీలు తీసుకొనివస్తుంది. ఆ భేదబుద్ధి పోతేగాని నీకు బ్రాహ్మీస్థితి కలుగదు. మనకు ఎప్పుడైనా వైరాగ్యం వస్తూ ఉంటుంది. మహర్షులకూ వైరాగ్యం ఉంటుంది. కాని మన వైరాగ్యానికి, వారి వైరాగ్యానికి తేడా ఉంది. మనకు ఈ ప్రపంచం అంతా నిజంకింద కనిపిస్తోంది. ఇక్కడ ఉన్న వ్యక్తులు, వస్తువులు, సంఘటనలు అన్నీ నిజం కింద కనిపిస్తున్నాయి. ఇక్కడ పరిస్థితులను బట్టి మనకు ఒకోసారి వైరాగ్యం వస్తుంది. అంటే పరిస్థితుల బట్టి మీకు వైరాగ్యం వచ్చింది కాని ఇదంతా మీకు నిజం కింద కనిపిస్తోంది. అబద్ధం మీకు నిజం కింద కనిపిస్తున్నంత కాలం మీకు వైరాగ్యం వచ్చినా అది నిలబడదు. అది ఏదో టైములో వస్తుంది, ఏదో టైములో పోతుంది. కాని జ్ఞానికి వచ్చిన వైరాగ్యం అలా పోదు. ఎందుచేతనంటే ఈ ప్రపంచంలో కనిపిస్తున్న ఏ మనిషి, ఏ వస్తువు, ఏదీ నిజం కాదు అని వాడికి అనుభవంలో ఉంటుంది కాబట్టి వాడి వైరాగ్యం పోదు. వాడికి అబద్ధం అబద్ధంగా కనిపిస్తుంది కాబట్టి వాడు మోహంలో పడే అవకాశం లేదు. మనం ఏదో శాస్త్రం చదివి ఇదంతా అబద్ధం అని నోటితో చెపుతాము కాని అది నూటికి నూరుపాళ్ళు నిజం అనే అనుభవం హృదయంలో ఉంటుంది. ఇంక మీకు వైరాగ్యం ఎక్కడ నిలబడుతుంది. మీరు పైకి ఏమీ చెప్పవద్దు. నేను సుఖపడాలి అనేకోరిక అసలు లోపల నీకు ఉందా, లేదా అది చూసుకో అంటున్నాడు జ్ఞానదేవుడు. ఆ కోరిక ఉన్నప్పుడు కామక్రోధములు ఎలా పోతాయి, ఎన్నడూ పోవు అని చెప్పాడు. జపాలు, ధ్యానాలు, సత్పురుషుల సహవాసం ఇవి ఏమీ చెయ్యవద్దు అని నేను చెప్పటం లేదు. వీటివలన నీకు ఆకోరిక పోలేదు అనుకో ఇంక నీ పని సున్న అంటున్నాడు.

దుర్వాసనలు, చెడ్డసంస్కారాలు, చెడ్డతలంపులు ఇవి అన్నీ మన మనస్సులో ఉన్నాయి. ఆ మనస్సే నేను అనే బుద్ధి నీకు పోలేదు. ఇంక నీకు శాంతి ఏమిటిరా పిచ్చివాడా అంటున్నాడు. నిన్ను ఎవరయినా పొగిడితే సంతోషిస్తావు, ఎవరయినా విమర్శిస్తే బాధపడతావు, కొంతమంది మేము అవమానం భరించలేము అని చెపుతారు, చిన్న మాట కూడా పడలేరు. కొంతమందిని మీరు చాలా అందంగా ఉన్నారు అంటే నిజంగా అందంగా ఉంటే వారికి సంతోషం వచ్చేస్తుంది. అంటే శరీరం పట్ల నేను అనే బుద్ధి ఉంది, మనస్సు పట్ల నేను అనే బుద్ధి ఉంది. నువ్వు ఏదైతే కాదో దానిపట్ల నీకు నేను అనే బుద్ధి ఉన్నప్పుడు మరి నీకు కామక్రోధములు

ఎలాపోతాయి. నీ హృదయం యొక్క లోయలలోనికి దిగి, హృదయంలో ఉన్న పొరలను కోసుకొని లోపల అట్టడుగుకు వెళ్ళితే అక్కడ నీకు సుఖపడాలనే కోరిక ఉంది అనుకో, ఇంక నీవు ఏ దేవుడిని పూజించినా కామక్రోధాలు పోవు. ఆ పూజలకు పుణ్యం రావచ్చు, పుణ్యం సుఖం రూపంలో ఖర్చు అయిపోతుంది. ఈ ఖర్చుఅయిపోయే గొడవలను పట్టుకొంటావా, ఎప్పడూ ఉండేది నీకు కావాలో చూసుకో. దేహం చనిపోయేటప్పడు దేహం పోతోంది అని మీరు అనుకోవటం లేదు, నేను చనిపోతున్నాను అనుకొంటున్నారు అంటే దేహమే మీరు అనుకొంటున్నారు. దేహము నేను అనే బుద్ధే అహంకారం. దేశంలో ప్రజలు అందరూ చనిపోయినా మీకు అక్కరలేదు కాని మీకుటుంబ సభ్యులు చనిపోతే మీరే చనిపోతున్నట్లు బాధపడతారు, అదే మమకారం. మీరు పైకి ఏమీ చెప్పవద్దు కాని ఇవి రెండూ మీ లోపల ఉన్నాయో లేదో మీకు తెలుస్తోంది కదా. మీ అబ్బాయికి జీతం పెరిగింది అనుకోండి, మా అబ్బాయికి జీతం పెరిగింది అని ఎంతో మందికి చెపుతారు, వాడు చివరకు మీకు అన్నం పెట్టడు. వాడికి పది రూపాయలు పెరిగితే అవి మీ జేబులో పడిపోతాయి అనుకొంటారేమిటి, ఇదంతా తింగరతనం. ఇదంతా మీ మమకారంలోనుండి వస్తోంది. మీకు అహంకారం, మమకారం ఉన్నాయో లేదో మీకే తెలుస్తోంది కదా లేకపోతే ఇతరులు ఎవరయినా ఏదైనా పుస్తకం చదివి చెప్పాలా అంటున్నాడు జ్ఞానేశ్వర్. అహంకారం, మమకారం మీలో ఉన్నప్పడు తిరిగి మేము పుడతామా, పుట్టమా అని ఎవరినీ అడగవద్దు, నూటికి నూరుపాళ్ళు పుట్టి తీరతారు అని చెప్పాడు అంటే మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది.

నేను సుఖపడాలి అనే కోరిక అది వేరుపురుగు. నువ్వు ఎండ్రిన్ కొడితే అది పోదు. ఆకులకు, రొబ్బలకు పట్టిన పురుగులు ఎండ్రిన్ కొడితే పోతాయి కాని వేరుకు పట్టిన పురుగు ఎండ్రిన్ కొడితే పోదు, దాని మూలంలో తవ్వితేనే గాని అది పోదు. మీకు ఎప్పడు ఆసక్తి ఉండకూడదు. పని చేస్తూఉండాలి, ఫలితంపట్ల ఆసక్తి ఉండకూడదు. పనిచేసి ఆ ఫలితం ఏదో రోజున వస్తుంది అని మీరు అనుకొంటే ఇంక అవుటయిపోతారు. మీ తలంపుతో సంబంధం లేకుండా ఫలితం వస్తే అది నిన్ను బంధించదు. నీ మనస్సులో ఉన్న దుర్వాసనలను, దురలవాట్లను, దుర్వాంఛలనన్నింటిని ఊడగొట్టి, దేహము పట్ల, మనస్సు పట్ల నేను అనే బుద్ధిని వదులుకొని ఎవడైతే ఈ భూమి మీద చరిస్తున్నాడో వాడు మాత్రమే మోక్షాన్ని పొందుతాడు. ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే నీకు ఆ స్థితి రావాలి, శరీరం చనిపోయిన తరువాత కాదు, ఆ స్థితిని పొందిన వాడు తిరిగి మోహంలో పడడు. మరణం వచ్చి మీ శరీరం మీద పడిన రోజుకి అయినా పైన చెప్పిన స్థితిని మీరు పొందితే అప్పడయినా మీరు

మోక్షాన్ని పొందుతారు అంటే ఒడ్డుకు వచ్చేస్తారు.

జ్ఞానదేవుడు ఇంకో రహస్యం చెప్పాడు. మీ అబ్బాయి పెళ్ళి అవ్వకముందు ఒకరకంగా ఉంటాడు, పెళ్ళయిన తరువాత ఒక రకంగా ఉంటాడు. పెళ్ళి అంటే ఏమిటి మీ అబ్బాయి ఒక స్త్రీ దేహాన్ని కొనుక్కొంటున్నాడు. మీ అబ్బాయికి సుఖం కావాలి. తల్లితండ్రులకంటే వాడి సుఖం వాడికి ముఖ్యం. వీడికి సుఖపడాలనే కోరిక ఉంది కదా, ఆ కోరిక ఈ అమ్మాయి నెరవేరుస్తుంది. ఆ ఎంజాయ్‌మెంట్‌లో వాడు నెమ్మదిగా తల్లిదండ్రులను మరిచిపోతాడు. ఇది జ్ఞానేశ్వర్ చెప్పిన గొప్ప రహస్యం. పెళ్ళి అయ్యాక కొడుకు తల్లిదండ్రులను ఎందుకు మరిచిపోతున్నాడో రీజన్ చెపుతున్నాడు. మీ అబ్బాయికి ఎంజాయ్‌మెంట్ కావాలి, ఆ వచ్చిన శవం వీడికి గ్రేట్ ఎంజాయిమెంట్ ఇస్తుంది. మామూలు ఎంజాయ్‌మెంట్ మీరు ఇవ్వవచ్చు గాని గ్రేట్ ఎంజాయ్‌మెంట్ ఇవ్వలేరు. కాబట్టి నెమ్మదిగా మానసికంగా మీకు దూరం అవ్వటం మొదలు పెడతాడు అని చెప్పాడు. తల్లితండ్రులకు నేను చెప్పేదేమిటంటే చేతిలో ఉన్నది గబుక్కున వదిలేయకండి. తరువాత వాళ్ళు చూస్తారు, చూడరు. మీరు బతికి ఉన్నంతకాలం మీ చెయ్యి విడిచి పెట్టవద్దు. మీ అనంతరం ఉన్నదేదో వాళ్ళే తింటారు. ధనం రావటం అనేది పోవటం అనేది కేవలం మీ తెలివితేటల మీద ఆధారపడి ఉండదు. ఈశ్వరుని దయ ఉంటే ఇల్లంతా ధనంతో నిండి పోతుంది, ఈశ్వరుని దయలేకపోతే మీరు కోరిక పెట్టుకొన్నా యిల్లు నిండదు సరికదా మీ పొట్ట వెళ్ళటమే కష్టమవుతుంది. నీ మనస్సులో ఏ సంకల్పాలు అయితే వస్తున్నాయో ఆ సంకల్పాలను తుడిచి పెట్టు. వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన తలంపులు ఇవి అన్నీ మనస్సులో ఉంటాయి. ఇవి నీకు ఉపయోగపడవు, నీకుటుంబానికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు, అందుచేత మనోవ్యాపారము తగ్గించుకో.

జ్ఞానికూడా మనలాగే అన్నం తింటాడు, స్నానం చేస్తాడు, ఇతరులను పలకరిస్తాడు, వాడికి మనస్సు ఉంటుంది. ఆ మనస్సులో చెడ్డ ఏమీ ఉండదు, అది సహజమనస్సు, అందులో భోగ ప్రవృత్తి ఉండదు. వాడికి కావలసిన సుఖం, శాంతి హృదయంలో నుండి సప్లయి అవుతూ ఉంటుంది. అజ్ఞాని మనస్సు సహజంగా ఉండదు. సహజంగా లేదు కాబట్టే బయటనుండి భోగాలు కోరుకొంటుంది. జ్ఞాని ఎప్పుడైనా మీమీద కోపం తెచ్చుకొన్నా అది అసూయమీదో, వైరంమీదో కాదు, నువ్వు బాగుపడాలనే అలా ప్రవర్తిస్తాడు. అది కూడా నేచురల్‌మైండే. లోపల అసూయపెట్టుకొని, లోపల చెడ్డ ఉద్దేశం పెట్టుకొని మనం కోపం తెచ్చుకొంటే, మనం ఇతరులను తిడితే అది అసహజమైన మనస్సు. అజ్ఞాని మనస్సు కృత్రిమంగా

ఉంటుంది. నీ మనస్సు కృత్రిమంగా ఉంటే దానిని జహాతి అంటే విడిచిపెట్టాలి, మామూలుగా విడిచిపెట్టటంకాదు ప్రజహాతి అంటే పూర్తిగా విడిచిపెట్టాలి, శేషం లేకుండా విడిచిపెట్టాలి. మోక్షం పొందటానికి అడ్డువచ్చే గుణాలు నీలో ఉంటే సాధన చేసి వాటిని పూర్తిగా విడిచిపెట్టు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే మీరు తిన్న అన్నం అరిగితే తిరిగి మీకు ఆకలిపుడుతుంది. అలాగే మీరు ఏదైనా శాస్త్రం చదివినా, పెద్దలు చెప్పింది శ్రవణం చేసినా అది మీకు అర్ధమైతే ఆత్మజ్ఞానం సంపాదించాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది కాని అది అర్ధంకాకపోతే ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగదు అని చెప్పారు.

విద్య యొక్క లక్ష్యం ఏమిటి అంటే విషయాలను సేకరించటంకాదు, ఏకాగ్రత సంపాదించాలి. ఏకాగ్రత లేకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానానికి పెట్టుబడి బాహ్యమైన సంపదలు కాదు. నీకు ఏకాగ్రత ఉండాలి, పవిత్రత ఉండాలి. ఆత్మజ్ఞానానికి అడ్డువచ్చే గుణాలు నీ మనస్సులో ఉంటే వాటిని ఎండింపజేయి. జ్ఞానేశ్వర్ ఏమనిచెప్పాడు అంటే నదులు వెళ్ళి సముద్రంలో కలిసేవరకూ ఇది గోదావరి నది, ఇది కృష్ణానది, ఇది గంగానది అని అనుకుంటాము. అవి సముద్రంలో కలిసాక ఇంక గంగానది లేదు, కృష్ణానది లేదు అంతా సముద్రంపాలు అయిపోతుంది. అలాగే నీకు జ్ఞానం కలిగేవరకూ నేను ఎల్లమ్మను, నేను పుల్లమ్మను, నేను ధవంతురాలిని, నేను పేదవాడిని అని ఇలా ఏడుస్తూనే ఉంటావు, జ్ఞానం కలిగేవరకూ ఈ ఏడుపు తప్పదు. ఆత్మజ్ఞానం పొందితే ఇంక ఏ గొడవ లేదు, ఉన్నది ఒక్కటే, అప్పుడు ఎటుచూసినా శాంతే, ఎటు చూసినా ఆనందమే. మీరు ఏ విషయంలోను, ఎవరితోటి పోల్చుకోవద్దు. ఇతరులతో పోల్చుకోవటం వలననే మీకు దుఃఖం వస్తోంది. మీ కొలతలను బట్టి మీరు బట్టలు కుట్టించుకొంటారు గాని ఇతరులను బట్టి కొట్టించుకోరు. అలాగే మీ పరిస్థితులను బట్టి మీరు బతకండి అంతేగాని ఇతరులతో పోల్చుకోవద్దు. ఈ పెంట అంతా మనస్సులో ఉంది. పైగా ఆ మనస్సే నేను అనే బుద్ధి నీకు ఉంది, అదే పెద్ద ప్రమాదం. అందుచేత ఆ మనస్సును పోగొట్టుకోవాలని నీకు అనిపించదు. అది నేనే అనుకొన్నప్పుడు నువ్వు ఎలా పోగొట్టుకొంటావు.

నీకు ఆత్మజ్ఞానం కలిగితే ఆత్మలో నుండే సుఖం, శాంతి అందుతూ ఉంటాయి. ఆత్మ సుఖానికి మించిన సుఖం ఎక్కడా లేదు. బాహ్యవిషయాలలోగాని, ఇతర లోకాలలో గాని ఎక్కడా సుఖం లేదు. మీరు పురాణాలు చదివి ఆ లోకంలో ఇంతభోగం ఉంది, ఈ లోకంలో ఇంత భోగం ఉంది అని నీవు అనుకొంటున్నావు అంటే ఆ భోగాల మీద నీకు లోపల కోరిక

ఉంది కాబట్టి ఆ లోకాలకు వెళితే ఆ భోగాలు అనుభవించవచ్చు అని నీకు అనిపిస్తోంది. పురాణాలు చదివి ఆ భోగాల మీద నీ మనస్సు వాలుతూ ఉంటే నీకు వైరాగ్యం లేదు అని అర్థం. భోగాల వలన పాపాలు వస్తాయి, భోగాల వలన రోగాలు వస్తాయి. మన దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ పాపం ఉన్నా, ఎక్కడ దోషం ఉన్నా వీటి అన్నింటికి 90 కారణాలు లేవు, అన్నింటికి రెండే కారణాలు ఉన్నాయి, అవే కామక్రోధాలు అన్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ వద్దు, వికర్షణ వద్దు అంటున్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ లేదు అనుకో, వికర్షణ లేదు అనుకో అప్పడు నీకు సమానబుద్ధి వచ్చేస్తుంది. నీకు సమానబుద్ధి వచ్చినప్పడు నీ బుద్ధి కంట్రోలులో మనస్సు ఉంటుందిగాని అది బయటకు వెళ్ళదు. నీ మనస్సు ఏ విషయాల మీదకు అయితే పరుగెడుతోందో ఆ విషయాలనుండి నీ మనస్సును వెనక్కి లాక్కో, అదే సాధన అని పరమాత్మ చెప్పాడు. కృష్ణభక్తుడు అయిన జ్ఞానదేవుడు ఏమి చెపుతున్నాడు అంటే నీకు ఆకర్షణ లేనప్పడు, వికర్షణ లేనప్పడు అసలు నీ మనస్సు బయటకే వెళ్ళదు కదా. అది బయటకు వెళితే దానిని వెనక్కి లాక్కోవటం గొడవ ఉంటుంది. అది బయటకు వెళ్ళాలి అంటే దానికి ఎక్కడైనా ఆకర్షణ ఉండాలి, వికర్షణ ఉండాలి. అవి రెండూ లేనప్పడు ఇంక అది ఎందుకు బయటకు వెళుతుంది. మీరు ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటి అంటే మీ మనస్సులో భోగప్రవృత్తి ఉంటే ఆ భోగప్రవృత్తిని సాధన చేసి నెమ్మదిగా బయటకు తోలేయండి. మనస్సును అసహజమైన విషయాలలోనికి వెళ్ళనివ్వకండి, మనస్సును సహజంగా ఉంచండి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-01-2011, చెరుకుమిల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రై గుణ్యో భవార్జున!**

**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (2-45)**

వేదం అంటే జ్ఞానం అని అర్థం. మనకి ఋగ్వేదం, యజుర్వేదం, అధర్వణవేదం, సామవేదం అని నాలుగు వేదాలు ఉన్నాయి. వేదంలో ఒక్క ఆత్మజ్ఞానం గురించేకాదు, భౌతిక జ్ఞానం గురించి కూడా చెప్పారు. వేదంలో ఉన్న మంత్రాలే పెళ్ళి మంత్రాలు చదువుతారు, శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు వెళ్ళినప్పడు అపరకర్మలు చేసినప్పడు కూడా చదివే మంత్రాలు వేదంలో చెప్పారు అంతేకాకుండా ఇల్లు ఎలా కట్టుకోవాలి అనేటువంటి విషయాలు కూడా చెప్పారు. ఇలా వేదంలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. వేదాలలో సత్త్వగుణం,